ఆస్తి పన్ను వడ్డీపై 90 శాతం రాయితీ

- ఉత్తర్వులు జారీచేసిన సీడీఎంఏ
- పన్ను చెల్లించేవారికి స్వల్ప ఊరట



నిజామాబాద్ సిటీ: రాష్ట్ర ప్రభుత్వం కార్పొరేషన్లు, మున్సిపాలిటీల్లో ఆస్తి పన్నుపై వన్ టైమ్ సెటిల్‌మెంట్‌కు అవకాశం కల్పించింది. జీహెచ్ఎంసీ తరహాలో ఆస్తి పన్నుపై వడ్డీలో 90 శాతం రాయితీ ఇవ్వాలని పురపాలక శాఖ నిర్ణయించింది. ప్రభుత్వ ప్రకటనపై నగరవాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఆస్తి పన్ను వడ్డీలో 90 శాతం రాయితీకి ఈ నెలాఖరు వరకే అవకాశం ఉంది. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

బల్దియాకు రావాల్సింది రూ. 89.5 కోట్లు

కార్పొరేషన్ పరిధిలో ఇప్పటివరకు 38 శాతం పన్ను వసూలైనట్లు కమిషనర్ దిలీప్‌కుమార్ తెలిపారు. బల్దియాకు రూ. 89.5 కోట్ల పన్నులు రావాల్సి ఉంది. ఇప్పటి వరకు రూ.35 కోట్లు వసూలయ్యాయి. ఇంకా రూ.54 కోట్లు వసూలు కావాల్సి ఉంది.

ప్రత్యేక టీంలు ఏర్పాటు

ఈ ఆర్థిక సంవత్సరం పూర్తయ్యేలోపు కనీసం రూ.9 కోట్లు వసూలు చేయాలని కమిషనర్ దిలీప్‌కుమార్ యత్నిస్తున్నారు. అందుకోసం ప్రత్యేక టీంలతో పాటు స్వయంగా క్షేత్రస్థాయిలో తిరుగుతూ పన్ను వసూళ్లు చేస్తున్నారు. డిమాండ్‌లో సగం వసూలు పూర్తిచేస్తేనే 15వ ఆర్థిక సంఘం నిధులు మున్సిపాలిటీకి కేటాయిస్తారు. ఆ టార్గెట్‌కోసం అధికారులు యత్నిస్తున్నారు.

స్వల్ప కలెక్షన్లు..

ప్రభుత్వం పెండింగ్ బకాయిల వడ్డీపై 90శాతం రాయితీ ఇవ్వడంతో నగరవాసులు బుధవారం పన్నులు చెల్లిస్తారనుకున్నా పెద్దగా స్పందన కనబడలేదు. దీనికి తోడు మనీ కలెక్షన్ మిషన్లలో సాఫ్ట్‌వేర్ అప్‌డేట్ కాకపోవడంతో మిషన్లు మొరాయించాయి. దీంతో పన్నులు కేవలం రూ. 35 లక్షలు మాత్రమే వసూలయ్యాయి.

సద్వినియోగం చేసుకోవాలి



ప్రభుత్వం ఇచ్చిన అవకాశాన్ని నగరవాసులు సద్వినియోగం చేసుకోవాలి. పెండింగ్ బకాయిల వడ్డీపై 90 శాతం మినహాయింపు వచ్చింది. దీంతో పెండింగ్ బకాయిదారులు వెంటనే పన్ను చెల్లించాలి. బల్దియాలో ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేస్తాం.

– ఎస్ దిలీప్‌కుమార్, మున్సిపల్ కమిషనర్

ప్రభుత్వ నిర్ణయం హర్షణీయం



సుభాష్‌నగర్: రాష్ట్రంలోని 13 మున్సిపల్ కార్పొరేషన్లలో ఆస్తి పన్ను వడ్డీపై రాయితీ కల్పించడంతో అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ బుధవారం హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు ఈనెల 31 లోగా ఆస్తిపన్ను చెల్లించే వారికి ఆస్తి పన్ను వడ్డీపై 90శాతం రాయితీ ఉంటుందని అన్నారు. అవకాశాన్ని నగర ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

క్లుప్తంగా

ఢిల్లీ వెళ్లిన మానాల, కేశ వేణు



నిజామాబాద్ సిటీ: కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి, నగర అధ్యక్షుడు కేశ వేణు బుధవారం ఢిల్లీకి వెళ్లారు. గురువారం ఢిల్లీలో నిర్వహించే కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుల సమావేశంలో వీరు పాల్గొననున్నారు. అక్కడ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.

భగత్‌సింగ్‌ను ఆదర్శంగా తీసుకోవాలి

నిజామాబాద్ అర్బన్: భగత్‌సింగ్‌ను విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని పీడీఎస్‌యూ నాయకుడు న్యాయవాది గొంట్యాల రమేశ్ అన్నారు. నగరంలోని ఎస్సీ హాస్టల్‌లో బుధవారం సాయంత్రం భగత్‌సింగ్ వర్ధంతి నిర్వహించారు. భగత్‌సింగ్ బ్రిటిష్ సామ్రాజ్యవాదానికి, విదేశీయుల దోపిడీకి వ్యతిరేకంగా పోరాడి చిన్న వయస్సులోనే తన ప్రాణాలను దేశం కోసం అర్పించారని అన్నారు. భగత్‌సింగ్ పోరాట స్ఫూర్తితో విద్యారంగ సమస్యలపై విద్యార్థులు ఉద్యమించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు జన్నారపు రాజేశ్వర్, సాయి కిరణ్, విజయ్, భారత్, నాందేవ్ ,వంశి, విద్యార్థులు పాల్గొన్నారు.

పరీక్ష ఫీజులను తగ్గించాలి

నిజామాబాద్‌అర్బన్: ప్రభుత్వ గిరిరాజ్ డిగ్రీ కళాశాలలో రెగ్యులర్, బ్యాక్ లాగ్ పరీక్షల ఫీజులను తగ్గించాలని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి జన్నారపు రాజేశ్వర్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా కళాశాలలో పరీక్షల విభాగం అధిపతి భరత్‌రాజ్, వైస్ ప్రిన్సిపాల్ రంగారత్నం, అకాడమిక్ కోఆర్డినేటర్ పురుషోత్తంకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో దేవిక, సాయి కిరణ్, విజయ్, అరవింద్, ప్రవీణ్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాలతో నేరాల అదుపు

మోపాల్: సీసీ కెమెరాలతో నేరాలను అదుపు చేయవచ్చని ఎస్సై యాదగిరి గౌడ్ అన్నారు. మోపాల్ మండలంలోని కాల్‌పోల్ గ్రామస్తులతో బుధవారం ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా గ్రామంలో ఆరు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకునేందుకు గ్రామస్తులు ముందుకొచ్చారు. ఎస్సై మాట్లాడుతూ.. మండలంలోని అన్ని గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకునేలా అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఆయన వెంట గ్రామపెద్దలు, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

యువ వికాసం స్కీంను యువతకు అందించాలి

నిజామాబాద్ నాగారం: ఎలాంటి నిబంధనలు, ఆటంకాలు లేకుండా రాజీవ్ యువ వికాసం స్కీంను యువతకు అందించాలని కోరుతూ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నరాల సుధాకర్ బీసీ సంక్షేమ అధికారి నర్సయ్యకు బుధవారం వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో దర్శనం దేవేందర్, కొయ్యాడ శంకర్, చంద్రకాంత్ పాల్గొన్నారు

అంబేడ్కర్ అందరి వాడు



మాట్లాడుతున్న బంగారు సాయిలు

నిజామాబాద్ నాగారం: అంబేడ్కర్ కొందరి వాడు కాదు.. అందరి వాడు అని సామాజిక కార్యకర్త, దళిత నాయకుడు బంగారు సాయిలు అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిఏ విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బోధన్ మండలం భవానీపేటలో 2015లో అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటుకు కృషి చేశామని అన్నారు. ప్రస్తుతం దీనిని అగ్రవర్ణాలకు చెందిన కులస్తులు కొందరు హైకోర్టు ద్వారా స్టే తీసుకొచ్చి అడ్డుపడుతున్నారని ఆరోపించారు. ఈ విషయమై సీపీకి విన్నవించినట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో భవానిపేట మాజీ సర్పంచ్ లాలయ్య, సక్కి విజయ్ కుమార్, కోనేరు సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

మద్యం సేవించి వాహనాలు నడపొద్దు

నిజామాబాద్ రూరల్: వాహనదారులు మద్యం సేవించి వాహనాలు నడపొద్దని రూరల్ ఎస్‌హెచ్‌వో మహ్మద్ ఆరిఫ్ సూచించారు. బుధవారం రాత్రి కాలూర్, ఖానాపూర్ వెళ్లే బైపాస్ రోడ్డు వద్ద డ్రంకన్ డ్రైవ్ తనిఖీలు చేపట్టారు. వాహనదారులు తమ వద్ద వాహన ధ్రువీకరణ పత్రాలను ఉంచుకోవాలని సూచించారు. తనిఖీల్లో రూరల్ పీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

రుణమాఫీ కాకపోవడంపై రైతుల ఆగ్రహం



సభకు హాజరైన రైతులు

సిరికొండ: సొసైటీ సిబ్బంది నిర్లక్ష్యంతో రుణాలు మాఫీ కాకపోవడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలంలోని తూంపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో మహాజన సభను బుధవారం నిర్వహించారు. సొసైటీలో ఆరు నెలల్లో జరిగిన లావాదేవీలను సీఈవో దేవీలాల్ సభలో చదివి వినిపించారు. రుణాలు మాఫీ కాని రైతులు మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రకటించిన తేదీ కంటే ముందే రుణాలు తీసుకున్నా ఆ వివరాలను సకాలంలో ఆన్‌లైన్ చేయకపోవడం వల్ల రుణమాఫీ వర్తించలేదన్నారు. గత మహాజన సభలో రుణాల మాఫీపై ప్రశ్నిస్తే ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి మాఫీ వచ్చేలా చూస్తామని చెప్పారని, ఆరు నెలలు గడిచినా రుణ మాఫీ రాలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. సొసైటీ సిబ్బంది నిర్లక్ష్యంతోనే రుణమాఫీ కాలేదని సొసైటీ ద్వారా మాకు రుణమాఫీ చేసి పట్టా పాసు పుస్తకాలు తిరిగి ఇచ్చేయాలని రైతులు డిమాండ్ చేశారు. జిల్లాలోని 54 సొసైటీల్లో ఇలాంటి సమస్య ఉందని, అది ప్రభుత్వ దృష్టిలో ఉందని ప్రభుత్వం మాఫీ చేస్తేనే తప్ప సొసైటీ ద్వారా రుణ మాఫీ చేయడం కుదరదని సొసైటీ సీఈవో, పాలకవర్గ సభ్యులు సమాధానం ఇచ్చారు. చైర్మన్ రాములునాయక్, వైస్ చైర్మన్ అబ్బాస్, డైరెక్టర్లు లక్ష్మణ్, భీమన్న, రూప్‌సింగ్, రమేశ్, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

నీటి బొట్టుకై నిరీక్షణ



ఇందల్వాయి: వేసవిలో పక్షులకు నీరు ఎంత అమూల్యమైనదో ఈ ఫొటో చూస్తే అర్థమవుతోంది. కింద రోడ్లు, మీద మేడలు మండల కేంద్రాలు, పట్టణాల్లో ఎక్కడా పక్షులకు మంచి నీటి లభ్యత ఉండదు. ఇందల్వాయి మండల కేంద్రంలో ఈ పక్షి నల్ల నుంచి వచ్చే నీటి బొట్టు కోసం రెక్కలు వాల్చుతూ వేచి చూస్తున్న దృశ్యాన్ని 'సాక్షి' తన కెమెరాలో బంధించింది. పక్షుల కోసం తమ ఇళ్లు, పొలాల వద్ద నీటి తొట్టెలు ఏర్పాటు చేయాలని పక్షి ప్రేమికులు కోరుతున్నారు.

తెలుగు సాహిత్యం–ప్రదర్శన కళలపై కార్యశాల

నిజామాబాద్ అర్బన్: నగరంలోని గిరిరాజ్ కళాశాలలో కొరవి గోపరాజు తెలుగు విభాగం ఆధ్వర్యంలో బుధవారం 'తెలుగు సాహిత్యం–ప్రదర్శన కళలు' అనే అంశంపై కార్యశాల నిర్వహించారు. కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ రంగరత్నం కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. విద్యార్థి మానసిక వికాసానికి కళలు ఎంతో సహకరిస్తాయని అన్నారు. విద్యార్థుల్లో నైపుణ్యాలను పెంపొందించేందుకు ఈ కార్యశాలను ఏర్పాటు చేసినట్లు కార్యశాల సమన్వయకర్త ఎం రామస్వామి తెలిపారు. ఉపన్యాస కళ అనే అంశంపై ప్రముఖ వ్యాఖ్యాత వీపీ చందన్ రావు వివరించారు. రంగస్థల ప్రదర్శన కళలు అంశంపై ప్రముఖ రంగ స్థల నటుడు, దర్శకుడు చామకూర శ్రీనివాస్‌రెడ్డి రంగస్థలం, అభినయాల వైరుధ్యాలను వివరించారు. విద్యార్థులకు నటన గురించి అవగాహన కల్పించారు. అనంతరం వక్తలను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో అకాడమీ కో–ఆర్డినేటర్ ఐ గంగాధర్, ఐక్యూ ఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ రాజేశ్, పీఆర్వో దండు స్వామి, రమేశ్ గౌడ్, కె గంగాధర్, రాజేశ్వర్, రాధిక, అర్చన, సవిత, పద్మారావు, రాహుల్, సుభాషిణి దేవి, అనసూయ, వినయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు

ఇఫ్తార్ విందులతో స్నేహభావం పెంపొందుతుంది

- అదనపు కలెక్టర్



అదనపు కలెక్టర్‌కు కర్జూర తినిపిస్తున్న ఉద్యోగి

నిజామాబాద్‌అర్బన్: ఇఫ్తార్ విందులతో స్నేహభావం పెంపొందుతుందని అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్ అన్నారు. తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం ఆధ్వర్యంలో బుధవారం కలెక్టరేట్‌లో ఇఫ్తార్ విందును ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి అదనపు కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. రంజాన్‌ను ముస్లింలు ప్రశాంతంగా జరుపుకోవాలన్నారు. కార్యక్రమంలో అలుక కిషన్, అమృత్ కుమార్, వాజిద్ హుస్సేన్, యోహన్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ ఆధ్వర్యంలో..

డిచ్‌పల్లి: మండల కేంద్రంలోని ఎస్ఎల్‌జీ గార్డెన్‌లో రూరల్ మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ ఆధ్వర్యంలో ముస్లిములకు బీఆర్ఎస్ నాయకులు ఇఫ్తార్ విందును ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు బాజిరెడ్డి జగన్, సాంబరి మోహన్, శక్కరికొండ కృష్ణ, దాసరి లక్ష్మీనర్సయ్య, ఒడ్డెం నర్సయ్య, నాయకులు పాల్గొన్నారు.

రైతులు దళారులను నమ్మి మోసపోవద్దు



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న తహసీల్దార్

ధర్పల్లి: రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని తహసీల్దార్ మాలతి అన్నారు. మండల కేంద్రంలో ధర్పల్లి సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సొసైటీ చైర్మన్ మల్లికార్జున్‌తో కలిసి ఆమె ప్రారంభించారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే రైతులు ధాన్యాన్ని విక్రయించి మద్దతు ధర పొందాలని సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఆర్మూర్ బాలరాజ్, చెలిమెల నర్సయ్య, మిట్టపల్లి గంగారెడ్డి పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలి

సిరికొండ: రైతులు సొసైటీ కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యాన్ని విక్రయించాలని సిరికొండ పీఏసీఎస్ చైర్మన్ చెల్లం గంగాధర్ అన్నారు. మండల కేంద్రంలోని పీఏసీఎస్‌లో మహాజన సభను బుధవారం నిర్వహించారు. సభలో చైర్మన్ మాట్లాడుతూ.. రైతులకు సొసైటీ ద్వారా అన్ని రకాల సేవలు అందిస్తున్నందున ధాన్యాన్ని సొసైటీ కేంద్రాల్లో విక్రయించాలని కోరారు. సస్పెండ్ అయిన ఉద్యోగుల నుంచి ఆడిట్‌లో తేలిన డబ్బులను త్వరగా రికవరీ చేయాలన్నారు. వైస్ చైర్మన్ సాయిరి నర్సయ్య, డైరెక్టర్లు సంతోష్‌రెడ్డి, చిన్నారెడ్డి, శ్రీలత, గంగవ్వ, లింగం, గోవింద్, రమేశ్, సీఈవో గిరిధర్ పాల్గొన్నారు.

ముగిసిన ఇందూరు తిరుమల బ్రహ్మోత్సవాలు



మోపాల్: మండలంలోని నర్సింగ్‌పల్లిలో ఉన్న ఇందూరు తిరుమల వేంకటేశ్వర స్వామి ఆలయ 11వ బ్రహ్మోత్సవాలు బుధవారం ముగిశాయి. యజ్ఞాచార్యులు, అర్చక స్వాములు, వేద పండితులు 108 కలశాలల్లో ఉన్న గంగ నీటితో స్వామి వారికి ఉత్సవానంతరం అభిషేకం చేశారు. త్రిదండి దేవనాథ జీయర్ స్వామి పర్యవేక్షణలో ఆచార్య గంగోత్రి రామానుజ దాస్ స్వామి ఆశీస్సులతో బ్రహ్మోత్సవాలు అద్భుతంగా పరిపూర్ణమయ్యాయని ఆలయ ధర్మకర్త నర్సింహారెడ్డి తెలిపారు. వచ్చే ఏడాది బ్రహ్మోత్సవాలను చాలా పెద్ద వేడుకగా నిర్వహిస్తామని పేర్కొన్నారు. పూజాకార్యక్రమాల్లో గంగోత్రి రామానుజ దాసు స్వామితోపాటు ఆలయ ధర్మకర్తలు దిల్ రాజు, విజయసింహారెడ్డి దంపతులు, నర్సారెడ్డి, నరాల సుధాకర్, పృథ్వీ, రమేశ్, భాస్కర్, నరేందర్, మురళి, సురేశ్, రవి, చిన్నయ్య, సాయిలు, యజ్ఞాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనుల పరిశీలన

ధర్పల్లి: మండలంలోని సీతాయిపేట్‌లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను ఎంపీడీవో బాలకృష్ణ బుధవారం పరిశీలించారు. గ్రామంలో 8 మంది లబ్ధిదారులు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను చేపట్టినట్లు తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల మాడల్‌ను అనుసరించి నిర్మాణం చేపట్టాలని లబ్ధిదారులకు ఎంపీడీవో సూచించారు.

సంక్షిప్తం

రైల్వే గేటు మూసివేత

మాక్లూర్: రైల్వే గేటు మరమ్మతుల కారణంగా మాక్లూర్ మండలం అడవిమామిడిపల్లిలో ఉన్న రైల్వే గేటును బుధవారం రాత్రి 9 నుంచి గురువారం ఉదయం 6 గంటల వరకు మూసి వేస్తున్నట్లు ట్రాఫిక్ పోలీసులు బుధవారం తెలిపారు. ఆ రహదారి గుండా ప్రయాణం సాగించే వాహనదారులు గమనించాలని కోరారు.

తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు

నిజామాబాద్ రూరల్: గ్రామాల్లో తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు చేపడుతున్నట్లు రూరల్ ఎంపీవో ఎక్బాల్ అన్నారు. రూరల్ మండలం రాంనగర్‌లో తాగునీటి కోసం గ్రామస్తులు పడుతున్న ఇబ్బందులను గుర్తించి బోరు బావి తవ్వకం పనులు చేపట్టినట్లు తెలిపారు. గ్రామాల్లో తాగునీటి ఎద్దడి నివారణకు తగు చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో మిషన్ భగీరథ ఏఈ దామోదర్ రావు, జీపీ కార్యదర్శి విష్ణువర్ధన్, మాజీ సర్పంచ్ జలానీ తదితరులు పాల్గొన్నారు.

పరీక్ష కేంద్రం తనిఖీ

సిరికొండ: మండలంలోని కొండాపూర్ జెడ్పీహెచ్ఎస్‌లో ఏర్పాటు చేసిన పదో తరగతి పరీక్ష కేంద్రాన్ని తహసీల్దార్ రవీందర్‌రావు బుధవారం తనిఖీ చేశారు. కేంద్రంలో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా అన్ని రకాల సౌకర్యాలను కల్పించాలని సిబ్బందిని ఆదేశించారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

డిచ్‌పల్లి: మండలంలోని నడిపల్లిలో బుధవారం ఉపాధి హామీ నిధులు రూ.15లక్షల తో చేపడుతున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఏఎంసీ డైరెక్టర్ దేవకరుణ ప్రారంభించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు శ్రీనివాస్‌గౌడ్, సుదర్శన్, వెంకటస్వామి, ఇబ్రహీం, విజయకాంత్, భాస్కర్, సుధీర్, కల్యాణ్, వీడీసీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

స్వాముల పూజలో వానరం



నిజామాబాద్ రూరల్: నగరంలోని గౌతంనగర్‌లో ఉన్న హనుమాన్ ఆలయంలో దీక్షాపరులు బుధవారం ఉదయం పూజలు చేస్తుండగా వానరం ప్రత్యక్షమైంది. పూజ చేస్తున్నంత సేపు అక్కడే ఉండి కొంత సేపటికి అక్కడి నుంచి వెళ్లి పోయిందని దీక్షాపరులు తెలిపారు.

సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

- నిజామాబాద్ ఏఎంసీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి



ప్రతిజ్ఞ చేస్తున్న ముప్ప గంగారెడ్డి, నాయకులు

మోపాల్: రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని నిజామాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలో నిర్వహించిన జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ అభియాన్ కార్యక్రమ సన్నాహక సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ 11 ఏళ్లలో, బీఆర్ఎస్ పదేళ్లలో చేపట్టలేని పథకాలు, అభివృద్ధిని కాంగ్రెస్ ప్రభుత్వం 16 నెలల్లో రెట్టింపు చేసిందని, కానీ కార్యకర్తలు ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లలేకపోతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా కార్యక్రమ మండల ఇన్‌చార్జి, కాంగ్రెస్ ఎస్సీ సెల్ అధ్యక్షుడు లింగన్న, జిల్లా ఆదివాసీ, గిరిజన చైర్మన్ యాదగిరి, ఎన్‌డీసీసీబీ డైరెక్టర్ గొర్కంటి లింగం, మండల అధ్యక్షుడు ఎల్లోల్ల సాయిరెడ్డితో కలిసి ప్రతిజ్ఞ చేశారు. కేంద్ర ప్రభుత్వం రిజర్వేషన్లు, రాజ్యాంగాన్ని రద్దు చేసేందుకు కుట్ర పన్నుతోందని ఆరోపించారు. మహాత్మా గాంధీ, అంబేడ్కర్‌ను కించపర్చిన చరిత్ర బీజేపీదన్నారు. బీజేపీ సోషల్ మీడియాలో దుష్ప్రచారాన్ని ప్రతి కార్యకర్త తిప్పికొట్టాలని సూచించారు. జాతీయ నాయకత్వం పిలుపు మేరకు ప్రతి కార్యకర్త జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ అభియాన్ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో నాయకులు గంగాప్రసాద్, కెతావత్ మోహన్, కిరణ్‌రావు, గుడి ప్రవీణ్‌రెడ్డి, ఆకుతోట సాయన్న, లక్ష్మారెడ్డి, దిలావర్ హుస్సేన్, రాజేశ్, రాజాకిషన్, సతీశ్‌రావు, శంకర్ పాల్గొన్నారు.

మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా

నిజామాబాద్ సిటీ: మున్సిపల్ కార్పొరేషన్‌లో కాంట్రాక్ట్ విధానాన్ని రద్దు చేసి సెల్ఫ్‌హెల్ప్ గ్రూప్‌ల ద్వారా విధులు నిర్వహించాలని డిమాండ్ చేస్తూ కార్మికులు మున్సిపల్ కార్యాలయం ఎదుట బుధవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా బీఎల్‌టీయూ జిల్లా ప్రధానకార్యదర్శి మేకల రాజేందర్ మాట్లాడుతూ.. ఖమ్మం, వరంగల్ తరహాలో నిజామాబాద్ మున్సిపల్‌లో కూడా కాంట్రాక్ట్ విధానాన్ని రద్దు చేసి సెల్ఫ్ హెల్ప్ గ్రూప్‌ల ద్వారా పనులు చేపట్టాలని కోరారు. నాయకులు ఆర్ మురళి, కొమ్ము రాహుల్, ఎల్లయ్య, నవీన్, సాయిలు, మోహన్‌గౌడ్, మోహన్, కార్మికులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీల సంఖ్య పెంచాలి



మాట్లాడుతున్న ఈజీఎస్ ఏపీవో మంజుల

డిచ్‌పల్లి: ఉపాధి పనుల్లో కూలీల సంఖ్య పెంచాలని ఈజీఎం ఏపీవో మంజుల సూచించారు. బుధవారం డిచ్‌పల్లి మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. గ్రామ నర్సరీల్లో మొక్కల పెంపకం కోసం అవసరమైన మెటీరియల్ కాంపోనెంట్ బిల్లులు సకాలంలో అందించాలన్నారు. గతంలో జరిగిన ఉపాధి హామీ సామాజిక తనిఖీల్లో సిబ్బందిపై వచ్చిన ఆరోపణలపై వివరణలను మండల పరిషత్ కార్యాలయంలో అందజేయాలన్నారు. మండల పరిషత్ సూపరింటెండెంట్ నివేదిత మాట్లాడుతూ.. జీపీ అభివృద్ధి ప్రణాళికపై చర్చించి తీర్మానాలు చేయాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. మార్చి నెలాఖరులోగా వందశాతం పన్నులు వసూలు చేయాలని సూచించారు.

ఎల్ఆర్ఎస్‌ను సద్వినియోగం చేసుకోవాలి

- డీఎల్‌పీవో శ్రీనివాస్



నమోదు వివరాలను పరిశీలిస్తున్న డీఎల్‌పీవో

డిచ్‌పల్లి: ఎల్ఆర్ఎస్ పథకాన్ని అర్హులైన ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని డీఎల్‌పీవో శ్రీనివాస్ సూచించారు. బుధవారం డిచ్‌పల్లి మండలం నడిపల్లి మేజర్ జీపీ కార్యాలయంలో ఎల్ఆర్ఎస్ నమోదు ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం 25 శాతం రాయితీ పై ఈ నెల 31వరకు ఎల్ఆర్ఎస్ ఫీజు చెల్లించే అవకాశం కల్పించిందన్నారు. 2020లో రూ.వేయి చెల్లించిన వారితో పాటు గతంలో కట్టని వారు సైతం ఈ నెల 31వరకు తమ ప్లాట్లను రెగ్యులర్ చేయించుకునే అవకాశం ఉంటుందన్నారు. గతంలో ఎల్ఆర్ఎస్ ఫీజు చెల్లించని వారు రిజిస్ట్రేషన్ కార్యాలయంలో ఫీజు చెల్లించి ప్లాట్లను రెగ్యులర్ చేయించుకోవాలన్నారు. నడిపల్లి జీపీ పరిధిలో ఎల్ఆర్ఎస్ రెగ్యులరైజేషన్ కోసం 1,346 మంది దరఖాస్తు చేసుకోగా ఇప్పటివరకు 46 మంది మాత్రమే ఫీజు చెల్లించినట్లు తెలిపారు. మిగిలిన వారు ప్రభుత్వం కల్పించిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆయన వెంట జీపీ కార్యదర్శులు నిట్టు కిషన్‌రావు, జయశ్రీ, జూనియర్ అసిస్టెంట్ రజత్‌కుమార్, సిబ్బంది రాము, సంతోష్ ఉన్నారు.

నవోదయకు ఎంపిక



వి సాధ్వి



టి శివాని

సిరికొండ: జవహర్ నవోదయ పాఠశాలకు సిరికొండ సత్యశోధక్ పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ రావుట్ల నర్సయ్య బుధవారం తెలిపారు. నవోదయలో 6వ తరగతి ప్రవేశానికి జనవరిలో నిర్వహించిన ప్రవేశ పరీక్షలో ప్రతిభ కనబర్చిన వి సాధ్వి, టి శివాణి ఎంపికయ్యారని అన్నారు. పాఠశాల నుంచి విద్యార్థులు నవోదయకు ఎంపిక కావడంపై హర్షం వ్యక్తం చేశారు.

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	90,500	వెండి(కిలో)	1,04,000
22 క్యారెట్స్	83,527	– నిజామాబాద్ బిజినెస్	

మాంసం ధరలు

చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్డ్	140
		లైవ్	90
స్కిన్‌లెస్	160	మటన్	800

కూరగాయల ధరలు(రూ.)

	హోల్‌సేల్	రిటైల్		హోల్‌సేల్	రిటైల్
టమాట	4	8	గాజరుగడ్డ	30	50
బెండకాయ	40	60	పచ్చిమిర్చి	40	60
బీరకాయ	40	60	దోసకాయ	30	50
దొండకాయ	30	60	ఆలుగడ్డ	20	40
బీర్నిసుకాయ	30	50	గోబిగడ్డ	10	20
కాకరకాయ	40	60	గోబిపువ్వు	15	30
వంకాయ	10	20	బీట్‌రూట్	20	40
పాలకూర	20	40	కరివేపాకు	70	120
మెంతికూర	30	50	చామగడ్డ	50	70
కొత్తిమీర	20	40	గోరుచిక్కుడు	50	70
పుదీనా	40	80	చిక్కుడుకాయ	60	80
క్యాప్సికం	35	60			

– సుభాష్‌నగర్

సినిమాలు

ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏషియన్)

స్క్రీన్-1 కోర్ట్ 1.40, 7.30, 10.30
ఆర్టిస్ట్(తెలుగు)-4.35
స్క్రీన్-2 ఎవడే సుబ్రమణ్యం 10.50, 4.30
పెళ్లికాని ప్రసాద్ 1.40, 7.30
స్క్రీన్-3 ఎవడే సుబ్రమణ్యం(తెలుగు)-1.30
ఆర్టిస్ట్(తెలుగు)-7.30-సలార్-పార్ట్-1(తెలుగు)-10.20

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)

స్క్రీన్-1 ఛావా 10.00, 4.45, 10.45
అనగనగా ఆస్ట్రేలియాలో-1.20 షణ్ముక-8.05
స్క్రీన్-2 కోర్ట్-10.05, 4.30, 7.35, 10.40
ఛావా(హిందీ)-1.10
స్క్రీన్-3 కిస్ కిస్ కిస్సిక్-11.00, 7.30
షణ్ముఖ-1.50 - ఆర్టిస్ట్-4.30, 10.20
స్క్రీన్-4 సలార్-పార్ట్-1-10.20, 4.25, 10.30 పెళ్లికాని ప్రసాద్-1.50, 7.55
లలితామహల్ కోర్ట్, దేవి పెళ్లికానిప్రసాద్
నటరాజ్ షణ్ముఖ, విజయ్ సలార్